క్లుప్తంగా

పారిశుధ్య కార్మికుల ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు, నేతలు

వెంకటగిరి రూరల్ : పురపాలక కార్యాలయం ఎదుట మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే అన్ని బెనిఫిట్స్ చెల్లించాలని కోరారు. ఇటీవల మృతి చెందిన కార్మికులకు పరిహారం అందించాలని స్పష్టం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతలు ప్రసాద్, పెంచలయ్య, సుబ్రమణ్యం, సుబ్బరత్నమ్మ, కృష్ణమ్మ పాల్గొన్నారు.

పశువుల దాహార్తిని తీర్చేలా నీటి తొట్టెలు


నిర్మాణంలోని పశువుల నీటి తొట్టెను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

చిల్లకూరు: మూగ జీవాలకు వేసవిలో నీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం గ్రామాల సరిహద్దులలో నీటి తొట్టెల నిర్మాణాలను చేపడుతోందని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పీడీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. మండలంలోని పారిచెర్లవారిపాళెంలో జరుగుతున్న ఫాంపాండ్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. తిప్పగుంటపాళెం గ్రామ సరిహద్దుల్లో నిర్మిస్తున్న నీటి తొట్టె పనులను తనిఖీ చేశారు. ఆయన వెంట ఏపీడీ చంద్రశేఖర రాజు, ఏపీఓ గిరిబాబు ఈసీ చలపతి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు శేషారెడ్డి, శీను తదితరులు ఉన్నారు.

సత్తా చాటిన ఎన్‌బీకేఆర్ విద్యార్థులు


విజేతలుగా నిలిచిన విద్యార్థులతో కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి


కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ విద్యార్థులు ఈ నెల 11 నుంచి 14 వరకు కడప కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన క్రీడాపోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచారు. బాస్కెట్‌బాల్, కబడ్డీ, బాల్‌బ్యాడ్మిటన్ జట్లు ప్రథమస్థానం సాధించగా, చెస్‌లో ఎస్.శుభదీప్ ద్వితీయస్థానం సాధించినట్లు కళాశాల పీడీ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. విజేతలను కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాపూరు: చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాపూరు షాదీమంజిల్‌లో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. నిర్వాహకులు మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మండలంలో ట్రస్ట్ తరపున వైద్యశిబిరాలు నిర్వహించి మందులు, కళ్లజోళ్లు అందిస్తున్నామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నట్లు వెల్లడించారు. వైద్యశిబిరంలో సుమారు 200 మంది పాల్గొన్నారని వారిలో 35 మందికి కళ్లజోళ్లు అందించామని ,40 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించామని వివరించారు.కార్యక్రమంలో వైద్యులు నిహారి, నిర్వాహకులు గౌరీశంకర్, సీతారామనాయుడు, కృష్ణ పాల్గొన్నారు.

అమెరికాలో వెంకటగిరి వాసి మృతి


రవితేజ (ఫైల్)

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బాబ్జీ కుమారుడు రవితేజ(35) అమెరికాలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు మంగళవారం తెలిపారు. అమెరికాలోనే ఉద్యోగం చేస్తూ.. అక్కడి యువతినే మూడేళ్ల క్రితం వివాహం చేసుకుని స్థిర పడిన రవితేజ ఆదివారం మరణించినట్లు తెలిసిందని వెల్లడించారు. రవితేజ మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. మృతికి గల కారణాలు తెలియలేదని వివరించారు.

మస్టర్ నమోదు పక్కాగా ఉండాలి

ఓజిలి: ఉపాధి పనులకు సంబంధించిన కూలీల మస్టర్ నమోదు విషయంలో అవకతవకలకు పాల్పడే క్షేత్రసహాయకులపై చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని మానమాల గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు.

గడ్డికి గిరాకీ



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాడి రైతులకు పశువుల దాణా పంపిణీపై దృష్టి పెట్టడం లేదు. దీంతో పాడి రైతులు వరి గడ్డి సమకూర్చుకోవడానికి నానా కష్టాలు పడుతున్నారు. దీంతో పాడి రైతులు వరి గడ్డి కొనుగోలుకు సాగు చేసిన రైతుల వద్దకు పరుగులు తీయాల్సి వస్తోంది. వరి కోతలు పూర్తి కావడంతో పాడి రైతులు పశువుల కోసం గడ్డిని సేకరించే పనిలో పడ్డారు. అయితే రైతులకు కొంత మంది ఉచితంగా గడ్డిని ఇస్తున్నప్పటికీ ఒక ట్రాక్టర్ గడ్డి ఇంటికి చేరేందుకు రూ.15 వేల వరకు ఖర్చు అవుతోంది. అదే బయట గ్రామాల నుంచి తీసుకుని రావాలంటే రూ 20 వేల వరకు పలుకుతోంది. దీంతో ఈ ఏడాది పాడి రైతులకు దాణా కష్టాలు తప్పడం లేదు.

– చిల్లకూరు

- మండుతున్న గడ్డి ధరలు
- ఒక ట్రాక్టర్ గడ్డి రూ.15 వేల పైమాటే
- పాడి రైతులకు తప్పని దాణా కష్టాలు

తిరుపతి జిల్లాలోని గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలలో ఎక్కువ శాతం వరి సాగు చేస్తుంటారు. దీంతో ఇక్కడ వరి గడ్డి బాగా దొరుకుతుంది. చిత్తూరు జిల్లాలో ఎక్కువ వరి సాగు ఉండని కారణంగా అక్కడ ఉన్న పాడి రైతులకు వరి గడ్డి నిత్యావసరం. దీంతో ఇక్కడకు చేరుకునే వ్యాపారులు వరి గడ్డిని కొనుగోలు చేస్తున్నారు. చిత్తూరు ప్రాంతంలో ఒక ట్రాక్టర్ గడ్డిని రూ.20 నుంచి రూ.25 వేలకు విక్రయిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో రెండు, మూడు పాడి గేదెలు ఉన్నవారు వరి గడ్డి కోసం అవస్థలు పడాల్సి వస్తోంది. గతంలో కూలీలతో కోతలు కోయడం ద్వారా వరి గడ్డి ఏడాది పొడవునా రైతుల వద్దనే దొరికే వీలుండేది. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేకుండా పోవడంతో కోతలు కోసిన సమయంలోనే పాడి రైతులు వరి గడ్డిని కొనుగోలు చేసుకుని నిల్వ చేసుకోవాల్సి వస్తోంది.


కొనుగోలు చేసుకుని చిత్తూరు జిల్లాకు వెళుతున్న వరి గడ్డి మోపులు

ఆరని గడ్డి పాడై పోతుంది

గతంలో కూలీలతో కోసిన పంటతో వచ్చిన గడ్డి ఓదెలు వేసి అటు తరువాత కుప్పలు తొక్కి మోపులు కట్టే వారు దీంతో కోత నుంచి గడ్డి మోపులు కట్టే సమయానికి కనీసం 15 రోజులు సమయం ఉండేది. దీంతో వరి గడ్డి బాగా ఆరిపోయి రెండేళ్లైనా వామి వేసి పెడితే కుళ్లి పోకుండా ఉండేది. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేక పోయింది. కారణం వరి కోతలు మిషన్‌తో చేపడుతుండడంతో గడ్డి చిన్న ముక్కలుగా మారుతుంది. ఇది ఆరకుండా మిషన్‌తో కట్టలు కట్టడంతో లోపలకు గాలి సోకక కుళ్లిపోయి రైతులు నష్ట పోతున్నారు.

ఖర్చు అదనం

ఒక ఎకరం గడ్డి కొనాలంటే కట్టలు కట్టించేందుకు మిషన్‌కు మూడు వేల నుంచి రూ.4 వేల వరకు ఖర్చు అవుతోంది. ఒక కట్టకు రూ 25 చొప్పున మిషన్ నడిపే వ్యక్తికి చెల్లించాలి. అలాగే దూరం బట్టి ట్రాక్టర్ బాడుగ చెల్లించుకోవాలి. అలాగే కొనుగోలు చేసిన గడ్డిని వామిగా వేసుకునేందుకు కనీసం ముగ్గురు కూలీలకు మూడు వేల నుంచి నాలుగు వేల వరకు చెల్లించాలి. ఇలా ఒక ట్రాక్టర్ గడ్డి ఇంటికి చేరే సరికే రూ 10 నుంచి రూ 15 వేల వరకు ఖర్చు అవుతుంది. ఇక పాడి రైతులు ఇతర దాణాకు సంబంధించి తవుడు 30 కేజీల బస్తా రూ.900, పెసర పొట్టు 50 కేజీల బస్తా రూ.1600 వరకు పలుకుతుంది. ఇలా పాడి రైతులకు దాణా కష్టాలు తప్పడం లేదు. ఇకనైనా ప్రభుత్వం పాడి రైతులకు దాణాను అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉచితమే కానీ.. రూ.12 వేలు పడింది



నాకు ఐదు పాడి గేదెలు ఉన్నాయి. వాటికి ఏడాది పొడవునా కనీసం నాలుగు ట్రాక్టర్ల గడ్డి అవసరమవుతోంది. దీంతో వరి సాగు చేసిన రైతుల వద్దకు వెళ్లి కోతలు పూర్తి అయిన తరువాత గడ్డి కావాలని అడిగే వారేమో ఉచితంగా ఇచ్చారు. అయితే ఇంటికి చేరేందుకు మోపులు కట్టే మిషన్‌కు ఒక మోపునకు రూ.25 చొప్పున చెల్లిస్తేనే కట్టారు. అనంతరం ట్రాక్టర్ బాడుగ, కూలీల ఖర్చు అంతా కలిపి ఒక ట్రాక్టర్ గడ్డి ఇంటికి చేరే సరికే రూ.12 వేలు ఖర్చు అయ్యింది.

– గోను రమణయ్య, తిక్కవరం, చిల్లకూరు మండలం

వేసవిలో తాగినన్ని నీరు పెట్టాలి



వేసవి కాలంలో ఎండు గడ్డి బాగా దొరుకుతుందని మేత ఎక్కువగా వేయడమే కాకుండా పాడి పశువులకు తాగినన్ని నీరు అందించాలి. పాలు బాగా వస్తుంటాయని గడ్డి పెట్టడమే చేయకూడదు. బయట మేతకు వెళ్లినప్పుడు అక్కడ చిన్న చిన్న గుంతల్లో ఉన్న నీటిని తాగితే సన్న పురుగులు కడుపులోకి వెళ్లి జబ్బు పడే అవకాశం ఉంది. అలాంటివన్నీ గమనించాలి.

– డాక్టర్ సురేష్, పశుసంవర్ధకశాఖ ఏడీ, గూడూరు

వైఎస్సార్ సీపీ నాయకులకు పరామర్శ


బాబురెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ఓజిలి: మండలంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులను మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మంగళవారం పరామర్శించారు. అత్తివరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్, సీనియర్ నాయకుడు జరుగుమల్లి బాబురెడ్డిని కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. ఇటీవల కొంత అనారోగ్యంతో ఉండి విశ్రాంతి తీసుకుంటున్న బాబురెడ్డిని పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సగుటూరు గ్రామంలో వైస్ ఎంపీపీ లెక్కల ప్రసాద్ నాయుడు తండ్రి అనారోగ్యంతో ఉండడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈయన వెంట మండల పార్టీ కన్వీనర్ పాదర్తి హరినాథ్‌రెడ్డి, సీనియర్ నాయకులు దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ప్రసాద్‌నాయుడు, సర్పంచ్ పంజాం వసంతమ్మ, నాయకులు బెల్లం సుబ్బానాయుడు, జయరామయ్య, సీపీ తదితరులు ఉన్నారు.


వైస్ ఎంపీపీ ప్రసాద్‌నాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సంజీవయ్య

అక్రమ కేసులతో వేధించొద్దు

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి


మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ పాలనకు పరాకాష్టగా మారిందని, ఒకే అంశంపై వివిధ పోలీస్ స్టేషన్లలో అక్రమ కేసులు నమోదు చేసి వేధించడం తగదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం చిల్లకూరులోని పార్టీ కార్యాలయంలో ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లాతో కలిసి మాట్లాడారు. పార్టీ సీనియర్ నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, సజ్జల భార్గవరెడ్డి, పోసాని కృష్ణమురళి, వైఎస్సార్ సీపీ సోషల్‌మీడియా ప్రతినిధులపై ఒక్కో ప్రాంతం నుండి ఒకే అంశంపై అనేక కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. బలవంతంగా పోలీస్‌స్టేషన్‌కు లాక్కెళ్లడం, బెయిల్ రానివ్వకుండా కోర్టుల చుట్టూ తిప్పుతూ పైశాచిక ఆనందం పొందుతున్న కూటమి నేతలకు మంచి పద్ధతి కాదన్నారు. సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెడుతున్న ఐటీడీపీ ప్రతినిధులు, కూటమి నాయకులపై చట్ట పరమైన చర్యలు తీసుకొనేలా కోర్టులను ఆశ్రయిస్తామన్నారు. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా ప్రతీకార చర్యలకు పాల్పడుతూ రెడ్‌బుక్ పాలనతో చట్టాలను నీరుగారుస్తున్న వారికి రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపైన, ఆయన సతీమణి వైఎస్ భారతిపై ఐటీడీపీ, కూటమి నేతలు అసభ్యకరమైన పోస్టులు పెట్టడంపై హైకోర్టును ఆశ్రయియిస్తున్నట్లు వివరించారు. న్యాయం జరిగే వరకు పోరాటాలు చేపట్టి జగనన్నకు అండగా నిలుస్తామన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు మోహన్, అశోక్, బాలసుబ్రమణ్యం, అశోక్, కుమారస్వామి, కృష్ణయ్య, గురవయ్య, చలపతి తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులపై విచారణకు ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

కలువాయి(సైదాపురం): కలువాయి మండలంలో చేపట్టిన ఉపాధి పనుల్లో అవకతవకలపై సాక్షి పత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనంపై శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు డ్వామా పీడీ గంగాభవానీ స్పందించా రు. వెంటనే విచారణ చేపట్టి రెండు రోజుల్లో నివేదిక సమర్పించాలని ఏపీడీ గాయత్రిని ఆదేశించారు.

స్తంభాల గిరీశ్వరయ్యస్వామి హుండీల లెక్కింపు

దక్కిలి: దేవునివెల్లంపల్లెలో ఉన్న స్తంభాల గిరీశ్వరయ్యస్వామి ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. ఈఓ శ్రీనివాసులు మాట్లాడుతూ తిరునాళ్ల సందర్భంగా స్వామివారికి భక్తులు హుండీలో రూ.3,67,135 సమర్పించినట్లు వెల్లడించారు.

రన్ ఫర్ జీసస్‌కు తరలిరండి


రన్ ఫర్ జీసస్ పోస్టర్ల ప్రదర్శన

కోట: ఈ నెల 19వ తేదీ రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేవీసీ పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దినకర్‌బాబు తెలిపారు. మంగళవారం కోటలోని బెరాకా ఆరాధన మందిరంలో క్రైస్తవ సంఘాల సమావేశం నిర్వహించారు. రన్ ఫర్ జీసస్ పోస్టర్లను ఆవిష్కరించారు. నోవా బాబు, ప్రభాకర్‌రావు, రత్నం, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఫైర్ స్టేషన్ అధికారులు

వెంకటగిరి(సైదాపురం) : అగ్ని ప్రమాదాలపై వెంకటగిరి అగ్నిమాపకశాఖ అధికారి వి.నారాయణ మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఫైర్ సేఫ్టీ నిబంధనలను వ్యాపారులు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ నెల 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు కొనసాగుతాయని వెల్లడించారు. అనంతరం సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు.

రాపూరు : అగ్నిమాపక వారోత్సవాల్లో భగంగా అగ్నిమాపక సిబ్బంది మంగళవారం రాపూరులోని ఆర్టీసీ బస్టాండ్, గ్యారేజీ సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి కుప్పయ్య మాట్లాడుతూ ఫైర్ యాక్సిడెంట్ జరిగిన వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

చిల్లకూరు: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా వ్యవహరించి నష్ట నివారణ చేసుకోవాలని గూడూరు అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జ్ అధికారి విజయకుమార్ సూచించారు. గూడూరు పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో చేపడుతున్న వారోత్సవాలలో రెండో రోజైన మంగళవారం గూడూరు పాత బస్టాండ్, ఆర్టీసీ డిపో, ఆ ప్రాంతంలోని గిరిజన కాలనీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీసీ డీఎం వెంకటేశ్వర్లు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఈదురుగాలులతో వర్షం

వెంకటగిరి రూరల్/కలువాయి(సైదాపురం) : వెంకటగిరి నియోజకవర్గంలో మంగళవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. వెంకటగిరి పట్టణంతోపాటు కలువాయి మండలంలోని పలు ప్రాంతాల్లో వర్షం పడింది. దీంతో నిమ్మ, మామిడి తోటలకు నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలువాయి మండలంలోని తోపుగుంట వద్ద స్తంభాలు, తాటి చెట్లు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

అంధకారంలో రెండు గ్రామాలు.

కలువాయి మండలంలోని కుల్లూరు, రాజుపాళెం గ్రామాల్లో రెండు రోజుల నుంచి విద్యుత్ సరఫరా లేదు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసేవారిపై చర్యలు తీసుకోండి

– పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు


పోలీస్ స్టేషన్‌లో సీఐ బాబీకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నాయుడుపేట టౌన్: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులు, పార్టీ మాజీ మహిళ మంత్రులపై అసభ్యకరంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెట్టేవారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై మంగళవారం వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్లు కలికి మాధవరెడ్డి, ఒట్టూరు కిషోర్ యాదవ్, సోషల్ మీడియా నియోజవర్గ ఇన్‌చార్జి నాగిరెడ్డి లక్ష్మీ ప్రసన్న కుమార్‌రెడ్డి నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో సీఐ బాబీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సమీపంలో కలికి మాధవరెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఐడీటీపీ ఆరాచకాలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని సీఐకు వినతి పత్రాన్ని అందించినట్లు తెలిపారు. వీరిపై చర్యలు చేపట్టకపోతే ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. అసభ్యకరంగా పోస్టులు చేస్తున్నా వారి ఐపీ నంబర్లు, అడ్రస్‌లు సైతం వినతి పత్రంలో అందించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు కటకం జయరామయ్య, దారా రవి, క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా కన్వీనర్ కాళహస్తి భావన్, ముస్లిం మైనారిటీ నియోజకవర్గ కన్వీనర్ షేక్ షబ్బీర్, మహిళ కన్వీనర్ ఈదా రత్నశ్రీ, ఓజిలి మండల కన్వీనర్ పాదర్తి హరినాథ్ రెడ్డి, కావేరిపాకం అశోక్ కుమార్, మెస్ భాస్కర్‌రెడ్డి, అనిల్‌కుమార్ రెడ్డి, పేట చంద్రారెడ్డి, ముత్యాలరెడ్డి, పేర్నాటి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో చైన్ అపహరణ


నాయుడుపేట టౌన్: ఓ మహిళ మెడలో చైన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు లాక్కెళ్లిన ఘటన నాయుడుపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నాయుడుపేట పట్టణంలోని లోతువానిగుంట ప్రాంతానికి చెందిన సిరివెళ్లి తులసి సోమవారం తన ఇంటి సమీపంలోని దుకాణానికి వెళ్లి, తిరిగి ఇంటికి వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తి బైక్‌లో వేగంగా వచ్చి ఆమె మెడలోని 2 సవర్ల బంగారు చైన్‌ను లాక్కుని పారిపోయాడు. స్థానికులు గుర్తించి, చుట్టు పక్కల గాలించినా ఆచూకీ తెలియరాలేదు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్డీఓ కార్యాలయం ముట్టడి


సూళ్లూరుపేట ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించిన సీపీఐ నాయకులు

సూళ్లూరుపేట: సత్యవేడు నియోజకవర్గం పరిధిలోని బుచ్చినాయుడు కండ్రిగ మండలం కనమనంబేడులో 252, 253, 254 సర్వేనెంబర్లలోని భూమిలో ఇంటి స్థలాలు లేని నిరుపేద దళితులకు ఇంటి నివేశనా స్థలాల పట్టాలు ఇవ్వాలని మంగళవారం సత్యవేడు నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి ఏ చిన్నిరాజ్ ఆధ్వర్యంలో సూళ్లూరుపేట ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం లోపలే శిబిరం ఏర్పాటు చేసుకుని బాధితులందరూ ముట్టడిలో కూర్చుని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీపీఐ నాయకుడు చిన్నిరాజ్ మాట్లాడుతూ నిరుపేదలైన దళితులకు పట్టాలివ్వమని సుమారు సంవత్సర కాలం నుంచి పోరాటం చేస్తుంటే పైన తెలిపిన సర్వేనెంబర్లు కలిగిన భూమికి ఫెన్సింగ్ వేస్తుంటే రెవెన్యూ అధికారులు చోద్యం చూశారని అన్నారు. రియల్ ఎస్టేట్ చేసుకునే వ్యాపారి వద్ద నుంచి ముడుపులు తీసుకుని రెవెన్యూ అధికారులు అతనికి సహకరిస్తున్నారని అన్నారు. ఆర్డీఓ జోక్యం చేసుకుని ఈ భూమిపై తగిన విధంగా విచారణ జరిపి దళితులకు న్యాయం చేయాలని కోరారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలం సీపీఎం కార్యదర్శి కత్తి ధర్మయ్య, ఇళ్లస్థలాల కోసం పోరాటం చేస్తున్న రమణయ్య, షణ్ముగం, గురవమ్మ, బాబు, వీరాస్వామి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు పరామర్శ


సుబ్బమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చిట్టమూరు: మల్లాం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత దువ్వూరు రామస్వామిరెడ్డిని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, పార్టీ నాయకులు మంగళవారం పరామర్శించారు. రామస్వామిరెడ్డి తల్లి దువ్వూరు సుబ్బమ్మ మంగళవారం మృతి చెందారు. దీంతో మల్లాం గ్రామానికి వెళ్లి సుబ్బమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు దువ్వూరు శేషురెడ్డి, గొట్టికాటి రవీంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ బీవీ రమణయ్య పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం


ఊరేగుతున్న ఆదిదంపతులు

దక్కిలి: మండలంలోని దేవునివెల్లంపల్లెలో స్తంభాలగిరీశ్వరయ్యస్వామి తిరునాళ్లలో భాగంగా మూడో రోజు మంగళవారం రాత్రి శివ పార్వతులకు వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పుష్పపల్లకిపై కొలువుదీర్చి ఊరేగించారు. అనంతరం ఆదిదంపతులకు కల్యాణోత్సవం జరిపించారు. ఈ క్రమంలోనే వధూవరుల ఉత్సవర్లకు ఘనంగా తెప్పోత్సవం నిర్వహించారు. ఎస్ఐ శివ శంకర్ బందోబస్తు పర్యవేక్షించారు.

పౌష్టికాహార పక్షోత్సవాలను వినియోగించుకోండి

ఓజిలి: పౌష్టికాహార పక్షోత్సవాలను గర్భవతులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.సుజన పేర్కొన్నారు. మండల పరిధిలోని కురుగొండ ఎస్టీ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. గర్భవతులు, తల్లులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గర్భవతులు పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యురాలు మంజుల, అంగన్‌వాడీ కార్యకర్తలు సుహాసిని, అనుషా, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే రక్తహీనత దూరం

చిల్లకూరు: గర్భవతులుగా ఉన్న సమయంలో పోషకాహారం తీసుకోవడంతో రక్త హీనతకు చెక్ పెట్టవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ మహబూబి సూచించారు. మండలంలోని తిప్పగుంటపాళెం గ్రామంలో మంగళవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పౌష్టికాహారం పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ రేణుక, అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మి, ప్రభావతి, హెల్పర్లు పెంచలమ్మ, సులోచనమ్మ పాల్గొన్నారు.

పనిదినాలు పెంచడం హర్షణీయం

గూడూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని చేసే వేతనదారులకు కూలీ నగదుతోపాటుగా పని దినాలు పెంచడం హర్షణీయమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చీపినేటి ప్రభాకర్ అన్నారు. గూడూరులో ఆయన మంగళవారం మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీల కోసం పలు మార్లు కేంద్రం దృష్టికి సీపీఐ తీసుకెళ్లిందన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం పలు మార్పులు, చేర్పులు జరిపినప్పటికి వేతనాలు పెంచడం వీలు కాలేదన్నారు. అయితే ఎట్టకేలకు కూలీలకు వేతనాలు పెంచడంతో పాటుగా పని దినాలు 100 రోజులు నుంచి 150 దినాలకు పెంచడం వేతనాలు రూ.300 నుంచి రూ.400 పెంచడం సంతోషంగా ఉందని అన్నారు.

కమనీయం.. కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సైదాపురం : శ్రీరామ నవమిని వేడుకల్లో భాగంగా మంగళవారం సైదాపురంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో కమనీయంగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు అన్నదానం చేపట్టారు. గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు


మాట్లాడుతున్న ఎంపీడీఓ భవాని

రాపూరు: వేసవి నేపథ్యంలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ భవానీ ఆదేశించారు. మంగళవారం రాపూరు ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బోర్లు, మోటార్లకు వెంటనే మరమ్మతు చేయించాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆంజనేయులు మాట్లాడుతూ కండలేరు నుంచి నీరు సరఫరా చేసేందుకు ప్రభుత్వం సర్వే చేపట్టిందని, అది పూర్తయితే నీటి ఎద్దడి తలెత్తదని వెల్లడించారు. ఎంఈఓ శ్రీనివాసులు మాట్లాడుతూ తెగచర్ల యూపీ స్కూల్‌ను హైస్కూలుగా అప్‌గ్రేడ్ చేశామని తెలిపారు. ఇరిగేషన్ ఏఈ సర్దార్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి చెరువు అభివృద్ధికి రూ.10 లక్షల చొప్పున మంజూరు చేయనున్నట్లు వివరించారు.